వైద్యుల సేవలు ఎనలేనివి


ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులను సన్మానిస్తున్న మోర్ట్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు

శంషాబాద్: సమాజంలో వైద్యుల సేవలు ఎనలేనివని మోర్ట్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. శ్రీనివాస్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరిండెంట్ డా. దుర్గలత, వైద్యులు ఫైజాన్ అహ్మద్, హరిబాబులను ఆయన సన్మానించి ప్రశంస పత్రాలు అందజేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో అందుతున్న సేవలు బాగున్నాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మోడల్ మీను సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రాంచందర్‌రావుకు శుభాకాంక్షలు



అత్తాపూర్: తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు నాయకత్వంలో పార్టీ మరింత బలపడుతుందని సీనియర్ నాయకురాలు కొమ్మిరెడ్డి ఉమామహేశ్వరిరెడ్డి అన్నారు. మంగళవారం రాంచందర్‌రావును ఆమె కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా ఎల్లమ్మ తల్లి కల్యాణ మహోత్సవం



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లిలోని రేణుకాఎల్లమ్మ తల్లి దేవాలయ ఆవరణలో మంగళవారం ఎల్లమ్మ తల్లి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అమ్మవారికి పట్టు వస్త్రాలను తీసుకొచ్చి అందజేశారు. పట్టు వస్త్రాలతో వచ్చిన ఎమ్మెల్యేకు దేవాలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యేతో పాటు స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పచ్చటి కల్యాణ మండపంలో వేదబ్రాహ్మణుల ఆధ్వర్యంలో రేణుకాఎల్లమ్మ కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని వివిధ రంగురంగు పూలతో అందంగా అలంకరించారు. ఉప్పర్‌పల్లితో పాటు స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో ఈ కల్యాణ మహోత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

రక్త దానం మహాదానం



ఏజీవర్సిటీ: రక్త దానం మహాదానమని మనం ఇచ్చే రక్త దానం వలన ఆపద సమయంలో ఎంతో మంది ప్రాణాలు కాపాడినవారవుతామని వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం ప్రొఫెసర్ జయశంకర వ్యవసాయ విశ్వవిద్యాలయం,స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా రక్త దాన శిబిరం నిర్వహించారు. ఇందులో ఎస్‌బీఐ సిబ్బంది, వ్యవసాయ విశ్వవిద్యాలయం బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 100 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. వేణుగోపాల్‌రెడ్డి రక్తదాన అవశ్యకత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ ఏజీఎం నితిన్‌కుమార్ మాలాట్కార్, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన


డ్రైనేజీ క్లీనింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని... ఇంట్లోని చెత్తను స్వచ్ఛ ఆటో కార్మికులకు అందించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర సూచించారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ ఆదేశాల మేరకు 100 రోజుల ప్రణాళికలో భాగంగా మంగళవారం ఉదయం కమిషనర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 16వ డివిజన్‌లోని లక్ష్మీనగర్‌కాలనీలో తడి, పొడి, హానికర చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. 18వ డివిజన్‌లో ఎస్‌ఎంఆర్ అపార్ట్‌మెంట్ దగ్గర నాలాను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్‌కుమార్, జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ సాయిబాబా, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో నిబంధనలు బేఖాతరు!

- ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీలో అనుమతి లేని అనేక పరిశ్రమలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న సంబంధిత శాఖ అధికారులు
- కాటేదాన్ పారిశ్రామిక వాడ పరిశ్రమల్లో అరకొర సేఫ్టీ పరికరాలు
- కాటేదాన్ ప్రాంతంలో అగ్నిమాపక స్టేషన్‌ను ఏర్పాటు చేయాలి


కాటేదాన్ పారిశ్రామిక వాడ


ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీలో ఏర్పాటు చేసిన పరిశ్రమలు


నిబంధనలకు విరుద్ధంగా అనేక షెడ్లు నిర్మించిన ఇందిరాగాంధీ సొసైటీ కాలనీ

మైలార్‌దేవ్‌పల్లి: పరిశ్రమలలో అజాగ్రత్త కారణాలతో అనేక మంది కార్మికులు బలవుతున్నారు. యాజమాన్యాలు డబ్బు సంపాదనే ధ్యేయంగా పరిశ్రమలను స్థాపిస్తున్నాయి పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి కనీస సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయడంలేదు. కార్మికుల కష్టాలను చూసే నాథుడే కరువయ్యాడు. కార్మికుల భద్రత గాలిలో దీపంలా మారిందని కొందరు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా పాశమైలారంలోని ఓ పరిశ్రమలో పేలిన సంఘటనలో 16 మంది మృత్యువాత పడ్డ విషయం తెలిసిందే. ఆ సంఘటనతో కార్మికుల్లో ఆందోళన నెలకొంది. పరిశ్రమలలోకి వెళ్లిన కార్మికులు క్షేమంగా తిరిగి ఇంటికి వచ్చే నమ్మకం సన్నగిల్లుతోంది.

జనావాసాల మధ్యే పరిశ్రమలు..

◆ చిన్నాపెద్ద అన్ని రకాల కంపెనీలు ఇక్కడ నెలకొల్పారు. పరిశ్రమలలో పని చేసే కార్మికుల పట్ల శ్రద్ధ తీసుకునే కంపెనీలు కొన్నే ఉన్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో అనేక పరిశ్రమలు జనవాసాల మధ్యలో ఉన్నాయి. వాటిని తరలించడానికి గత ప్రభుత్వాలు వేరే చోట స్థలాలను కూడా చూపించాయి. అయినా కొన్ని పరిశ్రమలు ఇక్కడి నుంచి వెళ్లడం లేదు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే కాని అధికారులలో చలనం కనిపించడం లేదు.

కార్మికులకు సేఫ్టీ ఇవ్వని కంపెనీలు

◆ రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్ దేవ్‌పల్లి డివిజన్ కాటేదాన్ పారిశ్రామికవాడ నాలుగు దశాబ్దాల నుంచి ఇక్కడ ఉంది. ఇక్కడి పరిశ్రమలలో సూది నుంచి అనేక రకాల వస్తువులను తయారు చేస్తారు. అలాగే అనేక డుప్లికేట్ వస్తువులను సైతం తయారు చేస్తారు. కానీ కార్మికులకు సేఫ్టీ మాత్రం ఇవ్వడం లేదు. సంబంధిత అధికారులకు అన్ని తెలిసి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ప్రతి ఏడాది 10 అగ్నిప్రమాదాలు..

◆ ప్రతి సంవత్సరంలో కాటేదాన్ పారిశ్రామికవాడలో సుమారు పది అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయి. ఎంతో ఆస్తి నష్టం జరుగుతోంది. ఇటీవల ఓ పరిశ్రమలో అగ్నిప్రమాదం సంభవించింది. కొట్ల రూపాయల ఆస్తినష్టం జరిగింది. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఇలా షార్ట్ సర్క్యూట్‌తో ఇతర కారణాలతో ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి. కానీ సంబంధిత శాఖల అధికారుల్లో మాత్రం చలనం లేదు.

పరిశ్రమలను తరలించాలి...



ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీని దశాబ్దాల క్రితం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి కొంత మంది కాలనీలో స్థిరపడ్డారు. ఇక్కడ అనేక రకాల పరిశ్రమలు ఉన్నాయి. పరిశ్రమలను తరలించాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదు. ఈ మధ్య కాలంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాను. కొంత మంది అధికారులను పంపిచారు. చూసి వెళ్లిపోయారు. కానీ ఎలాంటి స్పందన లేదు.

– కెకె. మూర్తి, ఇందిరాగాంధీ సొసైటీవాసి

ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలి



కాటేదాన్ పారిశ్రామికవాడలో ఎక్కువ పరిశ్రమలు ఉన్నాయి. అనుమతులు లేని పరిశ్రమలు చాలా ఉన్నాయి. అలాంటి పరిశ్రమలపై కొరడా ఝుళిపించాలి. పెద్ద పరిశ్రమల్లో కార్మికుల రక్షణకు సరైన పరికరాలు ఏర్పాటు చేయాలి. అగ్నిప్రమాదం జరిగితే తొందరగా ఫైర్ సిబ్బంది రాలేకపోతున్నారు. పరిశ్రమల మధ్యలో లేదా దుర్గానగర్ ప్రాంతంలో ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలి.

– అడికె రాజు, ఓబీసీ మోర్చా నేత

రైతు సౌభాగ్యమే దేశాభివృద్ధికి మూలం


వ్యవసాయ దినోత్సవంలో నార్మ్ రిటైర్డ్ టెక్నికల్ అధికారి నడికుడి ప్రభాకర్‌రావును సన్మానిస్తున్న అతిథులు

అత్తాపూర్: మానవజాతి జీవనాధారమైన వ్యవసాయ రంగం అభివృద్ధిలో కీలకపాత్ర వహించే రైతుల సౌభాగ్యం దేశాభివృద్ధికి మూలమని నేషనల్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ సంస్థ (నార్మ్) రిటైర్డ్ టెక్నికల్ అధికారి నడికుడి ప్రభాకర్‌రావు అన్నారు. మంగళవారం అత్తాపూర్ డివిజన్ లక్ష్మీనగర్ పార్కులో వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ వ్యవసాయ దినోత్సవం సందర్భంగా దేశాభివద్ధిలో వ్యవసాయ రంగం పాత్ర అనే అంశంపై సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నేషనల్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ సంస్థ రిటైర్డ్ టెక్నికల్ ఆఫీసర్ నడికుడి ప్రభాకర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా యోగా సెంటర్ ఏబీసీ లాఫింగ్ క్లబ్ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... భవిష్యత్ ఆహార భద్రత పర్యావరణ రక్షణ గ్రామీణ అభివృద్ధి, సహజ సమతుల్యతకు మూలమైన వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమష్టి కృషి చేయాలన్నారు. యోగా సెంటర్ గురువు బి.సుధాకర్‌గౌడ్ మాట్లాడుతూ... రైతు లేనిదే రాజ్యం లేదన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. ప్రధాన వక్తగా హాజరైన ఎనకామిక్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు నేదునూరి కనకయ్య మాట్లాడుతూ... స్వతంత్ర భారతంలో వ్యవసాయ రంగం పలు సంక్షోభాలకు నిలియంగా మారిందన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు సేంద్రీయ సాగు పద్ధతులను పాటించాన్నారు. ఆరోగ్య భారత్‌కు వ్యవసాయ రంగంలో ప్రభుత్వం పలు సంస్కరణలు చేపట్టాలన్నారు.

ఆశావర్కర్స్‌ను మూడో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి


మెడికల్ ఆఫీసర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశావర్కర్లు

మైలార్‌దేవ్‌పల్లి: ఈనెల 9వ తేదీన జరగబోయే దేశవ్యాప్త సమ్మెలో ఆశావర్కర్లు పాల్గొంటారని తెలంగాణ ఆశావర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాజేంద్రనగర్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సబిత, లక్ష్మీరాణి మైలార్‌దేవ్‌పల్లి యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా. రేఖను కలిసి సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆశావర్కర్స్‌కి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం రూ.26 వేలు అందించాలన్నారు. ఆశావర్కర్స్‌ను మూడో తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. పీహెచ్‌సీ ప్రభుత్వ ఆసుపత్రిలో విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమ్మెను ఆశావర్కర్స్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అస్మాబేగం, తపస్సు జుబేరియాబేగం, నాసియా, రైసా, బేగంవీణ, సరస్వతీ, విజయలక్ష్మీ, హైమావతి, వీరమణి, భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రబోడలో అంబేడ్కర్ ప్రజాభవన్ నిర్మించాలి

అత్తాపూర్: రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్‌గూడ ఎర్రబోడ వద్ద ఉన్న ప్రభుత్వ స్థలంలో విశాలమైన రీతిలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ పేరిట ప్రజాభవన్ నిర్మించాలని రాజకీయ పార్టీలు, పౌర సంఘాలు నిర్ణయించాయి. అంబేడ్కర్ భవన్ ఎస్సీలతో పాటు పేదలకు అండగా, స్థానికులకు నీడగా ఉండే విధంగా రూపొందించాలని తీర్మానించారు. శ్రీసప్తగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శివాలయం పునర్నిర్మిత కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా శ్రీ సప్తగిరి వెంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త గుమ్మకొండ మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్థానికంగా దాదాపు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, పౌర సంఘాల ప్రతినిధులు పాల్గొని ఈ తీర్మానం చేశారు.

◆ ఎర్రబోడలో సర్వే నం.7లో ఉన్న 33 గుంటల స్థలంలో విశాలంగా అంబేడ్కర్ భవనాన్ని నిర్మించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. గతంలో ఇక్కడ దళిత సంఘాల కోసం ప్రభుత్వం కొంత భూమిని కేటాయించింది. కొన్ని కారణాల వల్ల ఈ స్థలం చాలాకాలంగా ఉపయోగంలోకి రాలేదు. రాజకీయ పార్టీలు, పౌర సంఘాలన్ని ఏకతాటిపై రావడంతో భవనం నిర్మాణంపై ఏకగ్రీవ తీర్మానం జరిగింది.

వరదనీరు నిలువకుండా చర్యలు తీసుకుంటాం

రాజేంద్రనగర్ ఉపకమిషనర్ డా.రవికుమార్ నీరు నిలిచే ప్రాంతాల పరిశీలన



రాజేంద్రనగర్: వరదనీరు నిలువకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ ఉపకమిషనర్ డా. రవికుమార్ తెలిపారు. సోమవారం రాత్రి రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలతో పాటు ప్రధాన రహదారులు, బస్తీల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో మాన్సూన్ స్పెషల్ టీమ్‌తో పాటు జీహెచ్‌ఎంసీ సిబ్బంది అర్ధరాత్రి నుంచి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ప్రధానంగా హైదర్‌గూడ, ఉప్పర్‌పల్లి, బెస్ట్ ప్రైస్, శివరాంపల్లి, నేషనల్ పోలీసు అకాడమీ రోడ్డు, రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, ఆరాంఘర్ చౌరస్తా, బుద్వేల్ రైల్వే బ్రిడ్జి, రాజేంద్రనగర్ రేడియల్ రోడ్లపై వరదనీరు నిలిచిపోయింది. దీంతో సహాయ సిబ్బంది వెంటనే స్పందించి వరదనీరు వెళ్లేలా తగు చర్యలు చేపట్టారు. బస్తీలు, కాలనీల్లో సైతం నీరు నిలిచిపోవడంతో ఉపకమిషనర్ రవికుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆయా ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టి నీరు వెళ్లేలా చర్యలు చేపట్టారు. మంగళవారం ఉదయం ఆయన సిబ్బందితో అన్ని ప్రాంతాలను సందర్శించి సిబ్బందికి, అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు.

◆ అనంతరం ఆయన మాట్లాడుతూ... ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలో ఎప్పటికప్పుడు సిబ్బంది,అధికారులతో సమావేశాలు నిర్వహిస్తూ వర్షాకాలం నేపథ్యంలో ప్రత్యేక ప్రణాళికలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే ప్రాంతాలలో వరద నీరు నిలిచిపోతుందని గుర్తించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో వరదనీరు సాఫీగా వెళ్లేలా సిబ్బంది చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు. వరదనీటి కాలువలలో పూడికతీత పనులను పూర్తి కావచ్చాయని అన్నారు. ప్రజలు వరద కాలువలతో పాటు డ్రైనేజీలలో చెత్తాచెదారాలను వేయొద్దని కోరారు. డ్రైనేజీలు ఓవర్ ఫ్లో అయిన సమయంలో చెత్తాచెదారాలు, ప్లాస్టిక్ సంచిలు కనిపిస్తున్నాయని అన్నారు.

బంగారు పతకాలతో మెరిసిన విద్యార్థులు

ఏజీవర్సిటీ: ఉద్యానవన విశ్వవిద్యాలయం 4వ స్నాతకోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బంగారు పతకాలను అందించారు. బీఎస్సీ(ఆనర్స్) హార్టికల్చర్‌లో గుడిసె చైతన్య ఏకంగా నాలుగు బంగారు పతకాలు సాధించారు. అలాగే కొర్ర రోషిణికి ప్లాంట్ ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ , మైక్రోబయాలజీ కోర్సులలో ఓజీపీఏ టాపర్‌గా నిలిచినందుకు గాను డాక్టర్ కొమ్మ చంద్రశేఖర్ రెడ్డి స్మారక బంగారు పతకం లభించింది. కోతకాపు మౌనికా రెడ్డికి ఉద్యాన కోర్సులలో ఓజీపీఏ టాపర్‌గా గజ్జలలక్ష్మి, బాలిరెడ్డి బంగారు పతకం లభించింది. బీఎస్సీ (ఆనర్స్) ఫారెస్ట్రీలో, తొగితా రేణుక, సుదర్శి రమ్య బంగారు పతకాలు సాధించారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ (ఎంఎస్సీ హార్టికల్చర్)లో అచ్యుత మోనిక శ్రీ నాగిని రెండు బంగారు పతకాలు, సింధుజా.కె కూరగాయల శాస్త్రంలో టాపర్‌గా నిలిచి బోగ చంద్రయ్య, గంగు బాయి దంపతుల స్మారక బంగారు పతకం, రంజిత్‌కుమార్ (ప్లాంటేషన్, సుగంధ ద్రవ్యాలు, ఔషధ, సుగంధ పంటలలో టాపర్‌గా కేసర్ అన్నంవర్ స్మారక బంగారు పతకం) బంగారు పతకాలు గెలుచుకున్నారు. ఫ్రూట్ సైన్స్‌లో టాపర్‌గా దిశ ఎస్.కె. నోవా ఐకాన్ బంగారు పతకం గవర్నర్ చేతుల మీదుగా అందుకుంది.

గాలికి కూలిన చెట్టు

మణికొండ: భారీగా వీచిన గాలికి ఓ చెట్టు విద్యుత్ వైర్లపై పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవటంతో ప్రమాదం తప్పింది. మణికొండ మున్సిపాలిటీ, శ్రీరాంనగర్ కాలనీ ప్రధాన రోడ్డుపై మంగళవారం ఉదయం పెద్దగా గాలి రావటంతో ఓ చెట్టు విరిగిపోయింది. అది దాని కింద ఉన్న విద్యుత్ వైర్లపై పడటంతో అవి తెగిపోయాయి. ఆ సమయంలో అటుగా వెలుతున్న వారు ఎవరూ లేకపోవటం ఎలాంటి ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న మున్సిపాలిటీ అధికారులు వెంటనే చెట్టును ముక్కలుగా కట్ చేసి పక్కకు తప్పించారు.

పేద విద్యార్థులకు అండగా ఉందాం


విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేస్తున్న సీతారాం

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలను అందించి వారికి అండగా ఉందామని మణికొండ మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు డి.సీతారాం అన్నారు. మంగళవారం తన పుట్టిన రోజును పురస్కరించుకుని స్థానిక వీ ఫర్ యూ సహయోగ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పుప్పాలగూడ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో తృప్తిని ఇస్తాయన్నారు. రాబోయే రోజుల్లో మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. అంతకు ముందు ఆయనతో పాటు పార్టీ మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. ధన్‌రాజ్‌ల జన్మదినోత్సవ వేడుకల్లో పార్టీ నియోజకవర్గ ఇంచార్జి పి. కార్తిక్‌రెడ్డి పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, ట్రస్టు అధ్యక్షుడు ఎ.లక్ష్మన్‌రావు, సభ్యులు దిలిప్‌కక్కడ్, రాజశేఖర్, శ్రీధర్, సుమనళిని, ప్రధానోపాధ్యాయుడు మాంగ్యానాయక్, ఉపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, శ్రీదేవి, ఖాజామొయినుద్దీన్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలి

సైబర్‌సిటీ సర్కిల్ విద్యుత్ శాఖ ఎస్‌ఈ చంద్రశేఖర్


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యుత్ అధికారులు, సిబ్బంది

మణికొండ: విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది విధి నిర్వహణలో జాగ్రత్తలు తప్పనిసరి పాటిస్తూ పనులు చేయాలని విద్యుత్ శాఖ సైబర్‌సిటీ సర్కిల్ ఎస్‌ఈ చంద్రశేఖర్ అన్నారు. ఇబ్రహీంబాగ్ డివిజన్ పరిధిలోని నెక్నాంపూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన విద్యుత్ భద్రత వారోత్సవాలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యుత్ లైన్ల క్లియరెన్స్ పొందిన తరువాతనే వాటిపై పనిచేయాలన్నారు. పనిచేసే సమయంలో హెల్మెట్, సెఫ్టీ బెల్ట్ పెట్టుకుని, ఎర్తింగ్ వాడాలని సూచించారు. ప్రాణాలను కాపాడటంలో ఎర్తింగ్ పనిచేస్తుందని పేర్కొన్నారు.రెండు ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి ఎల్‌టీ ఫీడర్లు ఒకే స్తంభం వద్దకు వచ్చినపుడు డబుల్ ఫీడర్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ పనులు చేస్తున్న సమయంలో ఎట్టి పరిస్థితిలోనూ సెల్‌ఫోన్‌లు వాడొద్దని సూచించారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులు,ఉద్యోగులు, సిబ్బంది భద్రతా నియమాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డీఈ రమేష్‌చంద్ర, ఏడీఈలు అంబేద్కర్, రమేష్, రాజేశ్, సైదయ్య, సహాయ ఇంజినీర్లు సంతోష్‌కుమార్, మణికంఠ, ప్రవీణ్, కోటేశ్వర్‌రావు, రాము నాయక్, ప్రదీప్, శివరామకృష్ణలతో పాటు ఉద్యోగులు,సిబ్బంది పాల్గొన్నారు.

ఓ విల్లా కూల్చివేత..
మరో విల్లా వద్ద ఉద్రిక్తత

- అడ్డుకున్న నివాసితులు
- సమయం ఇవ్వాలని వాదన
- వెనుదిరిగిన అధికారి


ఓ విల్లాను నేలమట్టం చేయిస్తున్న మున్సిపల్ అధికారులు

మణికొండ: లేఅవుట్ అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన ఓ విల్లాను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. మరో విల్లా కూల్చివేత పనులు మొదలు పెడుతుండగా స్థానికులు వచ్చి సమయం ఇవ్వకుండా ఎలా కూల్చుతారని వాదనకు దిగారు. దాంతో బుధవారం ఉదయం వరకు సమయమిచ్చి అధికారి వెనుదిరిగారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి కాలనీలో ఈడబ్ల్యూఎస్, సింగిల్, డబుల్, త్రిబుల్ బెడ్ రూంలతో పాటు విల్లాల నిర్మాణాలను అప్పట్లో చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ఆరు విల్లాలను అదనంగా నిర్మించారని కొందరు హెచ్‌ఎండీఏ, మున్సిపల్, కోర్టులకు ఫిర్యాదు చేశారు. దీంతో గతేడాది నాలుగు విల్లాలను కూల్చివేశారు. మిగిలిన ఇద్దరు కోర్టును ఆశ్రయించటంతో స్టే ఇచ్చారు. ఇటీవల స్టే తొలగించి అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోర్టు ఆదేశించింది. అయినా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టడం లేదని ఫిర్యాదు దారులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. హైడ్రా ఆదేశాలతో మంగళవారం మిగతా రెండు విల్లాలను కూల్చిందేకు రాయదుర్గం పోలీస్, హెచ్‌ఎండీఏ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది బందోబస్తుతో కలిసి మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి సంతోష్‌సింగ్ ఆధ్వర్యంలో పనులు మొదలు పెట్టారు.

◆ ఒక విల్లాను కూల్చి మరో విల్లాను కూల్చేందుకు వెళ్లగానే అందులో నివసిస్తున్న వారితో పాటు యజమాని పనులను అడ్డుకున్నారు. విల్లాలు నివాసితులు ఉండగా ఎలాంటి నోటీసులు లేకుండా, సమయం ఇవ్వకుండా ఎలా కూల్చివేస్తారని వాదించారు. ఒక రోజు సమయం ఇస్తే అందులోనే సామగ్రిని తరలించుకుంటామని అన్నారు. దాంతో జేసీబీని అక్కడే ఉంచి బుధవారం ఉదయం కూల్చివేస్తామని, అంతలోపు సామగ్రిని తరలించుకోవాలని సూచించి టీపీఓ తన సిబ్బందితో వెనుదిరిగారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు కొందరు 15 సంవత్సరాల క్రితం నిర్మించుకునే సమయంలో మిన్నకున్న హెచ్‌ఎండీఏ, మున్సిపాలిటీలు కొనుగోలు దారులకు నష్టం కలిగించేలా ఇపుడు కూల్చివేతలు చేయటం ఏమిటని ప్రశ్నించారు. నిర్మాణ సమయంలో మిన్నకున్న అప్పటి అధికారులు, చిత్రపురి హౌసింగ్ సొసైటీ వారిపై చట్టపరంగా చర్యలు తీసుకున్న తరువాతనే కూల్చివేతలు చేపట్టాలని డిమాండ్ చేశారు.


కూల్చివేతలపై టీపీఓతో వాదిస్తున్న నివాసితులు